ఎల్బీనగర్‌లో మళ్లీ గులాబీ జెండా ఎగురవేస్తాం

• ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా • సత్యనగర్‌లో బీఆర్ఎస్ కొత్తపేట డివిజన్ బూత్ కమిటీ సమావేశం

ఎల్బీనగర్, అక్టోబర్ 12 : ఎల్బీనగర్‌లో మళ్లీ గులాబీ జెండా ఎగురవేస్తామని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా అన్నారు. గురువారం కొత్తపేట సత్యనగర్ కమ్యూనిటీ హాల్‌లో బీఆర్ఎస్ కొత్తపేట డివిజన్ బూత్ కమిటీల సమావేశంలో ఎమ్మెల్సీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎల్బీనగర్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి బాటలు వేస్తున్న ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని సూచించారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్ రాష్ట్రంగా అభివృద్ధి చెందిందన్నారు. కొత్తపేట డివిజన్‌లో బీఆర్ఎస్ బూత్ కమిటీ సభ్యులు శక్తివంచన లేకుండా పనిచేసి సుధీర్‌రెడ్డిని గెలిపించాలన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త గజ్జల మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ఎల్బీనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ విజయం ఖాయమని పేర్కొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా, చిత్రంలో బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ కొత్తపేట డివిజన్ అధ్యక్షుడు లింగాల రాహుల్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డివిజన్ మాజీ కార్పొరేటర్ జీవీ సాగర్‌రెడ్డి, నాయకులు రాగిరి ఉదయ్‌గౌడ్, మహేశ్‌రెడ్డి, యాదగిరి, పాండుగౌడ్, జహీర్‌ఖాన్, మహిళా నాయకులు విజయగౌడ్, శ్వేతారెడ్డి, రూపాసింగ్, పద్మ, అనూరాధ, యువజన నాయకుడు జోగు నగేశ్, కన్నయ్య ముదిరాజ్, ప్రవీణ్‌గౌడ్, బాలాజీ గైక్వాడ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్ఐటీఐలో స్వచ్ఛతా ఫ్రీడమ్ రన్

బండ్లగూడ జీఎస్ఐటీఐలో నిర్వహించిన స్వచ్ఛతా ఫ్రీడమ్ రన్‌లో పాల్గొన్న ఉద్యోగులు

మన్సూరాబాద్, అక్టోబర్ 12: ఎల్బీనగర్, నాగోల్, బండ్లగూడలోని జీఎస్ఐటీఐల్లో గురువారం ఫిట్ ఇండియా స్వచ్ఛతా ఫ్రీడమ్ రన్-4 నిర్వహించారు. జీఎస్ఐటీఐ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మాథ్యూ జోసెఫ్ జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిట్ ఇండియా ఉద్యమం శారీరక, మానసిక శ్రేయస్సు కోసం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పరిశుభ్రమైన వాతావరణం, పచ్చదనం, ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఊబకాయం, సోమరితనం, ఒత్తిడి, ఆందోళనను తగ్గించడం కోసం ఫ్రీడమ్ రన్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రజా సంబంధాల అధికారి గంజి మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

అన్న ప్రసాద వితరణ

ఎస్‌జీఆర్ కాలనీలోని సాయిబాబా మందిరం వద్ద అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

చంపాపేట, అక్టోబర్ 12 : చంపాపేట డివిజన్ ఎస్‌జీఆర్ కాలనీలోని షిర్డీ సాయిబాబా మందిరం వద్ద ప్రతి గురువారం అన్న ప్రసాద వితరణ చేపడుతున్నట్లు ఆలయ చైర్‌పర్సన్ అనంతలక్ష్మి తెలిపారు. భక్తుడు మీర్‌పేట్ నందిహిల్స్‌కు చెందిన చింతమ నారాయణరెడ్డి-పూర్ణిమ దంపతుల సహకారంతో గురువారం సుమారు 500 మందికి అన్నదానం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో చంపాపేట ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి బచ్చు మహేశ్‌గుప్తా, సరూర్‌నగర్ మండల ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు గుండా విజయరాములు, రవీందర్, సుదర్శన్, నాగమణి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు 'దసరా' బహుమతులు

హయత్‌నగర్, అక్టోబర్ 12 : దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ బస్సుల్లో వెళ్లే ప్రయాణికుల కోసం లక్కీడ్రా నిర్వహించి బహుమతులు అందజేస్తున్నట్లు ఆర్టీసీ హయత్‌నగర్ డిపో-1 మేనేజర్ జలగం విజయ్ తెలిపారు. గురువారం డీఎం విజయ్ విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 20 నుంచి 23 వరకు, 28 నుంచి 30 వరకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన వారు తమ టిక్కెట్ల పేరు, నంబర్ రాసి బాక్స్‌ల్లో వేయాలన్నారు. లక్కీడ్రా ద్వారా విజేతలను ఎంపిక చేసి రీజియన్ పరిధిలో 10 మందికి(పురుషులు-5, స్త్రీలు-5) ఒక్కొక్కరికీ రూ. 9,990 చొప్పున నగదు బహుమతి అందజేస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పికెటింగ్ పాయింట్ల ఏర్పాటు

ఉప్పల్, అక్టోబర్ 12 : ఉప్పల్, మల్కాజిగిరి అసెంబ్లీ పరిధిలో పోలీస్ పికెటింగ్ పాయింట్ల ఏర్పాటుపై గురువారం చర్చించారు. కార్యక్రమంలో ఉప్పల్ అసెంబ్లీ ఆర్ఓ అభిషేక్ అగస్త్య, మల్కాజిగిరి అసెంబ్లీ ఆర్ఓ ఎన్.రవికిరణ్‌లు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాలను గుర్తించారు. మల్కాజిగిరి అసెంబ్లీ పరిధిలోని సరిహద్దులోని ఏఎస్‌రావునగర్-నేరేడ్‌మెట్ ప్రాంతంలోని జ్యోతిరావుపూలే విగ్రహ ప్రాంతం, కుషాయిగూడ బస్‌డిపో రోడ్డు, ఉప్పల్ అసెంబ్లీ సరిహద్దులోని హైటెన్షన్ రోడ్డు ఫిఫెన్స్‌కాలనీ, ఏపీఐఐసీ కాలనీ జంక్షన్(జడ్‌టీసీ సెంటర్)లలో పోలీస్ పికెట్ పాయింట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తనిఖీలు నిరంతరం నిర్వహించనున్నట్లు తెలిపారు.

పౌష్టికాహార లోపంతోనే కీళ్ల వ్యాధులు

• 'వరల్డ్ ఆర్థరైటిస్ డే' సందర్భంగా అవగాహన ర్యాలీ

చంపాపేట, అక్టోబర్ 12 : పౌష్టికాహార లోపం వల్లనే కీళ్ల వ్యాధులు వస్తాయని డాక్టర్ కర్ణాకర్‌రెడ్డి అన్నారు. గురువారం 'వరల్డ్ ఆర్థరైటిస్ డే' సందర్భంగా బైరమాల్‌గూడలోని అవేర్ గ్లెనీగల్స్ గ్లోబల్ దవాఖాన ఆధ్వర్యంలో ఆర్థరైటిస్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. హాస్పిటల్ సీఓఓ డాక్టర్ కరుణాకర్‌రెడ్డి, డాక్టర్ అశ్విన్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ వీవీ సత్యనారాయణ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం దవాఖానలో డాక్టర్ల బృందం సమావేశంలో వారు మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 3 కోట్ల యాభై లక్షల మంది ఆర్థరైటిస్‌తో బాదపడుతున్నారని తెలిపారు. ఈ వ్యాధి బారిన పడకుండా ఉండటానికి ప్రతి ఒక్కరూ సమతుల్య ఆహారం తీసుకుని శరీర బరువు తగ్గించుకునేందుకు కృషి చేయాలన్నారు. బరువు పెరగడం వల్ల కీళ్లపై ఒత్తిడి పెరుగుతుందన్నారు. రోజువారి ఆహారంలో కాల్షియం సరైన మోతాదులో ఉండేలా చూసుకోవాలన్నారు. వ్యాయమం తప్పనిసరిగా చేయాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ జే విద్యాసాగర్, దవాఖాన హెచ్ఓడీలు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్థరైటిస్ అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న అవేర్ గ్లెనీగల్స్ గ్లోబల్ డాక్టర్ల బృందం, సిబ్బంది

పాఠశాలల్లో బతుకమ్మ సంబురాలు

శ్రీరామహిల్స్ కాలనీలోని ఓ పాఠశాలలో బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులు, సిబ్బంది

మన్సూరాబాద్/చంపాపేట, అక్టోబర్ 12: మన్సూరాబాద్ డివిజన్ శ్రీరామహిల్స్ కాలనీలోని ఓ ప్రైవేటు పాఠశాలలో గురువారం బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తులను ధరించి బతుకమ్మ పాటలు పాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రేఖా వెంకట్, ఇన్‌చార్జిలు హరిత, వందన, కవిత తదితరులు పాల్గొన్నారు.

అదేవిధంగా కర్మన్‌ఘాట్ గాయత్రినగర్ చౌరస్తాలోని ఓ పాఠశాలలో గురువారం బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రిన్సిపాల్ కే. రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్యామ్‌సుందర్, రూప, సరిత, మాధురి, విద్యార్థినులు పాల్గొన్నారు.

కర్మన్‌ఘాట్ గాయత్రినగర్‌లోని ఓ పాఠశాలలో..

మోహన్‌నగర్‌లో ఓ పాఠశాలలో గురువారం బతుకమ్మ సంబురాలను నిర్వహించారు. చిన్నారులకు ఇంగ్లిష్ డిక్షనరీలను తెలంగాణ వికాస సమితి రంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ కంఠం సైదులు, కరస్పాండెంట్ ఎండీ ఇస్మాయిల్ పంపిణీ చేశారు.

– ఎల్బీనగర్, అక్టోబర్ 12

ఆలిండియా నవ్ సైనిక్ క్యాంపునకు ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక

హయత్‌నగర్, అక్టోబర్ 12 : ఇండియన్ నావెల్ స్టేషన్, మహారాష్ట్రలో జరిగే ఆలిండియా నవ్ సైనిక్ క్యాంపునకు హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్స్ ఎం.ఝాన్సీ, పి.సాయికుమార్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్యోత్స్నప్రభ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డైరెక్టర్ జనరల్ ఎన్‌సీసీ, ఢిల్లీ ఆధ్వర్యంలో జరిగే ఈ క్యాంపును మహారాష్ట్ర ఎన్‌సీసీ డైరెక్టరేట్ వారు నిర్వహిస్తున్నారని, దేశంలోని 17 ఎన్‌సీసీ డైరెక్టరేట్స్ నుంచి దాదాపు 600 మంది క్యాడెట్స్ పాల్గొంటారని తెలిపారు. అక్టోబర్ 14 నుంచి 25 వరకు జరిగే ఈ నేషనల్ క్యాంపులో షిప్ మోడలింగ్, ఫైరింగ్, డ్రిల్స్, సెమఫోర్, లైన్‌ఏరియా, టెంట్ పిచింగ్, వాలర్ బోట్ రిగ్గింగ్, సర్వీసు సబ్జెక్టు, సీమెన్ షిప్, హెల్త్ అండ్ హైజీన్, బోట్ పుల్లింగ్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని కళాశాల ఎన్‌సీసీ ప్రోగ్రామ్ ఆఫీసర్, సబ్ లెఫ్టినెంట్ డాక్టర్ ధన్‌రాజ్ తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఐక్యూఏఐసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఇంతియాజుద్దీన్ ఫారూఖీ, డాక్టర్ శంకర్, డాక్టర్ సుబ్రమణ్యం, సత్యనారాయణ, డాక్టర్ సునీత, తదితరులు నవ్ సైనిక్ క్యాంపునకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

ఎంపికైన హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్స్ ఝాన్సీ, సాయికుమార్

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ

ఎల్ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

ఉప్పల్, అక్టోబర్ 12 : హబ్సిగూడలోని ఎమ్మెల్యే నివాసంలోని కార్యాలయంలో గురువారం రూ.95 వేల ఎల్ఓసీని అందజేశారు. ఈమేరకు ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి చేతులమీదుగా దరఖాస్తుదారుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో జనంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గరిక సుధాకర్, నందికంటి శివ, ప్రదీప్‌రెడ్డి, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాప్రా కాలనీల సమాఖ్య సమావేశం

కాప్రా, అక్టోబర్ 12: కాప్రా పరిధిలోని కాలనీల ప్రతినిధుల సర్వసభ్య సమావేశం ఆదిత్యనగర్ కాలనీ పార్కులో జరిగింది. ఈ సందర్భంగా కాప్రా పరిధిలో పలు కాలనీల్లో నెలకొన్న ట్రాఫిక్, ఇతర సమస్యలతోపాటు కాప్రా చెరువు పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రతినిధులు చర్చించారు. సమావేశంలో కేసీసీ అధ్యక్షులు ఎన్.సంజీవరెడ్డి, కార్యదర్శి మధుకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు రామాచర్యులు, కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు